క్లుప్తంగా

కొలువుదీరిన పీర్లు



తాటిపాడు పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు

జూపాడుబంగ్లా: మొహర్రం వేడుకలు ప్రారంభం కావడంతో మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, తంగడంచ, జూపాడుబంగ్లా, మండ్లెం, పారుమంచాల తదితర గ్రామాల్లోని చావిడిలలో పీర్లదేవుళ్లు బుధవారం కొలువుదీరారు. గ్రామాల్లో పెద్దహుసేనాలం, చిన్నహుసేనాలం, అలీ,అక్బర్, హసన్, హుసేన్ పీర్లతో పాటు గోకారమయ్య పీర్లను కూర్చోబెట్టారు. ఈనెల 14న చిన్నసరిగెత్తు, 15న పగలు సరిగెత్తు, 16న పెద్దసరిగెత్తు వేడుకలను నిర్వహించటంతో పాటు 17న పీర్లను ఏటికి సాగనంపనున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు.

పాఠశాలల్లో ప్యారలల్ మీడియం కొనసాగించాలి

పాములపాడు: అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్యారలల్ మీడియం కొనసాగించాలని డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రత్నం ఏసేపు కోరారు. బుధవారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అశాస్త్రీయమైన ప్రభుత్వ ఉత్తర్వులతో పాఠశాలల విలీనం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై అదనపు పీరియడ్ల భారం పెరిగిందన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిశోర్, ఉపాధ్యక్షుడు సోమశేఖర్, జిల్లా కౌన్సిలర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయండి

నందికొట్కూరు: ఈనెల 20న కర్నూలులో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ కార్యాలయంలో జనరల్ కౌన్సిల్ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవడానికి రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను కర్నూలు నందు దేవి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా కోశాధికారి రమణయ్య శెట్టి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లనాయుడు, పుల్లన్న, శివ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తంగడంచ రైతు సేవా కేంద్రం వీహెచ్‌ఏ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుసేవా కేంద్రంలో కంది, మినుము, ఉల్లి విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. ఐసీపీఎల్ 87119 సీఎస్ రకం నాలుగు కిలోల బ్యాగు పూర్తి ధర రూ.559లు కాగా రాయితీ రూ.167లు పోను రైతులు రూ.392లు చెల్లించాలన్నారు. వీబీఎన్–8 రకం మినుము విత్తనాలు నాలుగు కిలోల బ్యాగు పూర్తి ధర రూ.560లు కాగా రాయితీ రూ.168లు పోను రైతు రూ.392లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటితో పాటు ఉల్లి నాటుకొనే రైతుల కోసం ఎల్–883 రకం కిలో రూ.2,400లు, అగ్రిఫౌండ్ డార్క్‌రెడ్ రకం కిలో రూ.2,000ల చొప్పున విక్రయిస్తుండగా రాయితీ కిలోకు రూ.600లు ఇస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు 2కిలోల చొప్పున ఓ రైతుకు ఐదు కిలోల వరకు ఉల్లివిత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం అపహరణ

కొత్తపల్లి: రోడ్డుపై ఉంచిన ఓ ద్విచక్రవాహనం అపహరణకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నందికుంట గ్రామానికి చెందిన కిరణ్, భూషన్న అనే ఇద్దరు వ్యక్తులు సోమవారం రాత్రి సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై ఆత్మకూరుకు వెళ్తున్నారు. గ్రామ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం దగ్గరలో రోడ్డు పై ద్విచక్రవాహనాన్ని పెట్టి బహిర్భూమికై పొలాల్లోకి వెళ్లారు. తిరిగి వచ్చేలోపు ద్విచక్రవాహనం కనడబడలేదు. చుట్టుపక్కల వెతికిన ఎక్కడా ద్విచక్రవాహనం దొరకలేదు. స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశామని బాధితులు బుధవారం తెలిపారు.

సిద్ధాపురం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఆత్మకూరు: సిద్ధాపురం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ కోరారు. బుధవారం ఆయన గ్రామానికి చెంది విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సిద్ధాపురం నుంచి వెంకటాపురంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు చదువుకునేందుకు వెళ్తుంటారన్నారు. బస్సు లేకపోవడంతో ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు.

ప్రారంభిస్తే వినియోగించుకుంటాం!

- వైఎస్సార్‌సీపీ హయాంలో బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల నిర్మాణం
- జూపాడుబంగ్లా, పారుమంచాలలో ప్రారంభానికి నోచుకోని వైనం
- ధాన్యం నిల్వచేసుకునే వెసులుబాటు లేక ఇబ్బందుల్లో రైతులు



పారుమంచాలలో రూ.75లక్షలు వెచ్చించి నిర్మించిన గోదాం,



జూపాడుబంగ్లా లో రూ.45లక్షలు వెచ్చించి నిర్మించిన బహుళ ప్రయోజన గోదాం

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమార్థం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలోని జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల్లో రూ.లక్షల నిధులను వెచ్చించి బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను నిర్మించింది. రైతులు పండించిన పంటలను ఆయా గ్రామాల్లోనే భద్రపర్చుకొనేందుకు వీలుగా వీటిని నిర్మించారు. అయితే అవి ప్రారంభానికి నోచుకోకపోవడంతో ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గోదాములను ప్రారంభిస్తే సద్వినియోగం చేసుకుంటామని కోరుతున్నారు.

రూ.లక్షలు వెచ్చించి నిర్మాణాలు

పారుమంచాల గ్రామంలో రూ.75 లక్షలు వెచ్చించి వెయ్యిమెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం, మండ్లెం గ్రామానికి రూ.45లక్షల వ్యయంతో 500మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం మంజూరు కాగా అక్కడ స్థలం లేక దాన్ని జూపాడు బంగ్లాలో నిర్మించారు. గోదాముల నిర్మాణం పూర్తై ఆరుమాసాలైంది. నిర్మాణాలు పూర్తిచేసిన కాంట్రాక్టర్ వాటిని సహకార సంఘాలకు అప్పగించారు. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభించలేదు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి నెల రోజులు దాటుతున్నా నేటికీ వాటిని ప్రారంభించకపోవటంతో రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు సరైన వసతుల్లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు గోదాములను ప్రారంభిస్తే రైతులు ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని నిల్వచేసుకొనే వెసులుబాటు కలుగుతుందని అన్నదాతలు కోరుతున్నారు.

గోదాములను అందుబాటులోకి తేవాలి



జూపాడుబంగ్లాలో నిర్మించిన గోదామును వెంటనే ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తేవాలి. నేను ఏటా ఆరు ఎకరాల్లో పలురకాల పంటలు సాగుచేస్తాను. పండించిన ధాన్యాన్ని ఇంట్లో నిల్వచేసుకునేందుకు స్థలం లేక ఉన్న రేట్లకే నష్టమో, లాభమో వెంటనే విక్రయించుకోవాల్సి వస్తోంది. ధాన్యం నిల్వచేసుకొనేందుకు స్థలం ఉంటే గిట్టుబాటు ధర లభించేవరకు నిల్వచేసుకొనే అవకాశం ఉంటుంది. బంగ్లాలో నిర్మించిన గోదామును వెంటనే ప్రారంభించి ధాన్యం నిల్వచేసుకొనే వెసలుబాటు కల్పించాలి. – మధు, రైతు, జూపాడుబంగ్లా

రైతులు ధాన్యం నిల్వచేసుకునేలా చేస్తాం



జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల్లో నిర్మించిన గోదాముల నిర్మాణం పూర్తికావడంతో వాటిని కాంట్రాక్టర్లు మాకు అప్పగించారు. ఎన్నికల కోడ్ రావడంతో వాటి ప్రారంభం నిలిచిపోయింది. ప్రస్తుతం నూతన ప్రభుత్వం అమలైనందున ప్రజాప్రతినిధులు, అధికారులు గోదాములను ప్రారంభించిన వెంటనే రైతులు గోదాముల్లో దాన్యాన్ని నిల్వచేసుకొనేందుకు అవకాశం కల్పిస్తాం.
– చంద్రశేఖర్‌గౌడు, సీఈఓ, 80బన్నూరు సహకార సొసైటీ

పండ్ల తోటల పెంపకం టార్గెట్‌ను పూర్తి చేయాలి

పాములపాడు: 150 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం టార్గెట్‌ను పూర్తి చేయాలని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫారంపాండ్స్ ఉన్న గ్రామాల్లో త్వరగా పనిని పూర్తి చేయాలని చెప్పారు. హౌసింగ్ మ్యాన్‌డేస్ 90 మస్టర్ వేసి పేమెంట్స్ చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్, టీఏ, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

వడ్డెర్ల అభివృద్ధికి కృషి చేయాలి

మహానంది: వడ్డెర్ల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, బంజరు భూములను గుర్తించి ఒక్కొక్క కుటుంబానికి ఐదు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు చల్లా వెంకటేష్ కోరారు. వడ్డెర సంఘం నాయకులతో కలిసి బుధవారం బండిఆత్మకూరు తహసీల్దార్ సుమతికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని వడ్డెరలకు స్థలాలు ఇవ్వడంతో పాటు ఆర్థికాభివృద్ధికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం మండల ఉపాధ్యక్షుడు పల్లపు రాము, గోగుల రామసుబ్బయ్య, మహేష్, సంపంగి శివ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



పగిద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు

పాములపాడు: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శివలక్ష్మి, రమణమ్మబాయి డిమాండ్ చేశారు. బుధవారం కోర్కెల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని కేంద్రాల అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

పగిడ్యాల: బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశావర్కర్లులు ధర్నా చేపట్టారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించి ఆదుకోవాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖుర్షీద్‌బీ, షాజదాబేగం, రాములమ్మ, ప్రభావతి, భాస్కరామణి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ నూర్జహాన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రసన్న, పద్మావతి, వెంకటరమణమ్మ, గురుదేవి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకురాలు ఈ హరిత, మండల నాయకులు నాగమణి, రాజమ్మ,విజయమ్మ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాము ఆధ్వర్యంలో కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలకృష్ణయ్య

కొత్తపల్లి: ఆరోగ్యంపట్ల అశ్రద్ధ చేయొద్దని, ప్రస్తుతం వర్షకాలం కావడంతో వివిధ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలకృష్ణయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ ప్రజలకు సమావేశమై వ్యాధులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరమన్నారు. అదే విధంగా మతా శిశు సంరక్షణ గురించి వివరించారు. అదేవిధంగా డయేరియా, డెంగీ, ఓఆర్‌ఎస్ కలుపు విధానం, బీసీజీ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ ఆయేషాబేగం, ఫీమేల్ ఆరోగ్య సలహాదారు దేవ కరుణమ్మ, ఆరోగ్య సలహాదారు గుర్రప్ప, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, శ్రీరాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు ప్రారంభం



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అల్లూరు, వడ్డెమాను, దామగట్ల పంచాయతీలకు నూతనంగా మంజూరైన ట్రాక్టర్లను బుధవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, వ్యర్థాలను ఒక చోటనుంచి మరోచోటకు తరలించేందుకు స్వచ్ఛభారత్ కార్పొ ట్రాక్టర్లు మంజూరు అయ్యాయన్నారు.

గోదాము ఇన్‌చార్జ్‌పై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

నందికొట్కూరు: నందికొట్కూరు సివిల్ సప్లై గోదాము ఇన్‌చార్జ్‌పై ఆయా గ్రామాల రేషన్‌డీలర్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు ఫిర్యాదు చేశారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో ఆయా గ్రామాల రేషన్ డీలర్లు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా నందికొట్కూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల రేషన్ డీలర్లు గోదాము ఇన్‌చార్జి నారాయణమ్మపై చర్యలు తీసుకోవాలని కోరారు. రేషన్ బియ్యాన్ని కాటా లేకుండా సరఫరా చేస్తుందని తెలిపారు. దీంతో ప్రతి నెల ప్రతి షాప్ నుంచి 3 క్వింటాళ్ల బియ్యం తరుగు వస్తున్నాయని వాపోయారు. డీలర్లకు తెలియకుండా ఆర్వోలు తీయడం, తీసిన ఆర్వోలకు సరుకు పంపించకుండా ఈపాస్ మిషన్లో కార్డుదారులకు ఇచ్చినట్లు కొట్టాలని, సరుకు లేదు వస్తే మళ్లీ ఇస్తాం అని చెప్పడం, తీసిన ఆర్వోలకు డీలర్లకు డబ్బులు చెల్లించకుండా ఉండడం వంటి అవినీతి చర్యలకు పాల్పడుతుందని మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే అవినీతి అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, రేషన్ డీలర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి మహేష్

కొత్తపల్లి: మొక్కజొన్న పంటలను సాగుచేస్తున్న రైతులు కత్తెర పురుగుపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఏఓ కె.మహేష్ సూచించారు. బుధవారం మండలంలోని దుద్యాల గ్రామంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలను ఎక్కువగా కత్తెర పురుగు ఆశిస్తుందన్నారు. కత్తెర పురుగు మొక్క మొవ్వును తినడంవల్ల కత్తిరించినట్లు కనిపిస్తుందని చెప్పారు. మొక్కజొన్న పంటలో కత్తెరపురుగును నివారించేందుకు వేపనూనె (1500పీపీఎం) 5 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయసుకోవాలని సూచించారు. పంటలను కత్తెర పురుగు ఆశించిన తొలి దశలో క్లోరోపైరిఫాస్ 50 ఈసీ 2.5 ఎంఎల్ లీటర్‌నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఒక వేల ఉధృతి ఎక్కువగా గమనించినట్లయితే ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్ర సిబ్బంది శేషు, పల్లవి, రైతులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధిపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

మహానంది: రైతులు వరినారు మడి తయారు చేసుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జీవ శిలీంద్ర నాశిని ఉపయోగించి విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని బండిఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. మండల పరిధిలో బుధవారం రైతుల సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం వల్ల నేల ద్వారా సంక్రమించే తెగుళ్లతో పాటు మొక్కల పైభాగంలో వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. లీటరు నీటికి ఐదు గ్రాముల సూడో మోనాస్ ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా అగ్గితెగులు, పొడితెగులు, ఆకుమచ్చ తెగులు రాకుండా చూసుకోవచ్చని చెప్పారు. కౌలుకార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దేవాలయాలు, చర్చిలో చోరీ

జూపాడుబంగ్లా: 80బన్నూరు సమీపంలోని జూపాడు శ్రీఆంజనేయస్వామి, ఈశ్వరాలయాల్లో మంగళవారం తెల్లవారుజామున దొంగలు పడి వెండి వస్తువులు దోచుకెళ్లినట్లు పూజారి ఉమామహేశ్వరశర్మ తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వివరాల మేరకు.. కేజీ రోడ్డు పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయ తాళం పగులగొట్టి గుడిలోకి చొరబడిన దొంగలు స్వామివారికి వెండితో తయారు చేయించిన కంఠాభరణం, మీసాలు, కళ్లు, ఆలయంలోని సీసీ కెమెరాల రికార్డర్, యాంప్లిఫైయర్ దోచుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న శివాలయంలోకి చొరబడిన ఆలయంలో శివలింగంపై ఉంచి పంచలోహాల నాగాభరణం ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. అలాగే 80బన్నూరు చర్చిలోని హుండీని పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. ఆలయాలు, చర్చిల్లో జరిగిన దొంగతనాల విషయమై పూజారి, చర్చి నిర్వాహకులు జూపాడు బంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ

పాములపాడు: మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలోని శివాలయం, జూటూరు గ్రామంలోని జంబులమ్మ దేవాలయాల్లో చోరీలు జరిగినట్లు ఎస్‌ఐ అశోక్ బుధవారం తెలిపారు. క్రిష్ణారావుపేట గ్రామంలో రాత్రి సమయంలో గర్భగుడిలోని శివపార్వతుల పంచలోహా విగ్రహాలు (సుమారు రూ. 20వేలు విలువ), జూటూరు గ్రామంలోని జంబులమ్మ గుడిలో హుండీలోని నగదును అపహరించారని చెప్పారు. వేలి ముద్రలు పడకుండా దుండగులు చేతులకు కవర్లు తొడుక్కొని చోరీకి పాల్పడ్డారన్నారు. పూజారి శ్రీకృష్ణాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో విజయ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం 33వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కడప డివిజన్ ఐసీఈయూ జనరల్ సెక్రటరీ రఘునాథ్‌రెడ్డి, ప్రెసిడెంట్ అవదానం, శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ అక్బర్‌బాషా, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ సునయ, జిల్లా నాయకులు రమేష్, బ్రాంచి సెక్రటరీ కె.పి.మనోజ్ పాల్గొన్నారు. ఎల్ఐసీ సంస్థ అభివృద్ధికి, పాలసీలు చేయించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు.

చిరుత నుంచి రక్షించాలి



డీఎఫ్‌ఓ అనురాగ్‌మీనాకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని నల్లమల ప్రాంతంలోని మహానంది పరిసర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా సంచరిస్తున్న చిరుతను బంధించి ప్రజలకు రక్షించాలని హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ ఫయాజ్ కోరారు. బుధవారం ఈమేరకు డీఎఫ్‌ఓను స్థానిక కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసి ఫయాజ్ మాట్లాడుతూ.. మహానంది దేవస్థానంలో చిరుత సంచరిస్తున్నా అక్కడి అటవీ అధికారులు స్పందించకపోవడంతో భక్తులతో పాటు స్థానికుల్లో భయాందోళన నెలకొందన్నారు. వెంటనే చిరుతను బంధించి తరలించాలని విజ్ఞప్తి చేశారు.

తక్కువ ధరకు కంది పప్పు, బియ్యం



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

డోన్ టౌన్ : పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరకు కందిపప్పు, బియ్యాన్ని అందించనుందని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనున్న సివిల్ సప్లై అవుట్‌లెట్ షాప్‌ను ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో 2, ఆళ్లగడ్డ,డోన్, ఆత్మకూరు పట్టణాల్లో ఒకటి చొప్పున మొత్తం జిల్లా వ్యాప్తంగా ఐదు అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవుట్ లెట్‌లలో కిలో కంది పప్పు ఒక్క కుటుంబానికి కేజీ రూ.120, స్టీమ్ ఫైన్ రైస్ కిలో రూ.49 చొప్పున ఐదు కిలోలు, బీపీటీ సోనా మసూరి కిలో రూ.48 ప్రకారం ఐదు కిలోలు గురువారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు.

చిరుతపులి నుంచి ప్రాణాలు కాపాడండి



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

మహానంది: మహానంది పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుతపులి నుంచి మా ప్రాణాలు కాపాడాలని మహానంది గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మహానంది తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామచంద్రుడు, ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి, ఏఈఓలు ఎరమల మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, డీఆర్ఓ హైమావతి, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ చిరుతపులిని బంధించి సుదూర ప్రాంతాలకు తరలించాలని తీర్మానం చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అటవీశాఖ భూమి చుట్టూ హద్దులు ఏర్పాటు చేసి పొడవాటి గుంతలు(ట్రెంచ్‌లు) ఏర్పాటు చేయాలన్నారు.

మహానంది ఆలయం వెనుకకు వెళ్లొద్దు

మహానంది ఆలయానికి వచ్చే భక్తులు ఆలయం వెనుకవైపు, గోశాల ప్రాంగణాల వైపు వెళ్లొద్దని మైకుల ద్వారా భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. మహానందిలోని ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన నాగన్నపై చిరుత దాడి చేసిన నేపథ్యంలో భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. సమాచార కేంద్రంలోని మైకుల ద్వారా ప్రతి నిమిషానికి ఒకసారి అనౌన్స్ చేయిస్తున్నట్లు ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు తెలిపారు.

మొక్కజొన్న పంటల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆత్మకూరు: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన జిల్లా ఏరువాక కేంద్రం, నంద్యాల ప్రిన్సిపల్ సైటింస్ట్, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఏ.రామకృష్ణారావు, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డిలు సంయుక్తంగా బుధవారం మండలంలోని కరివేన, నల్లకాలువ, బాపనంతపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో సాగైన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలపై వివరించారు. డివిజన్‌లోని ఆత్మకూరు, కొత్తపల్లి, వెలుగోడు, పాములపాడు మండలాల్లో అధిక వర్షాల వల్ల అక్కడక్కడ లోతట్టు పొలాల్లో నీరు నిలిచి ఉన్నట్లు గుర్తించారు. మొక్క జొన్న పంటల్లో కత్తెర పురుగు ఆశించి నష్టం కలిగిస్తున్నట్లు గమనించారు. అధిక వర్షాలు, కత్తెర పురుగు నుంచి పంటలను ఏవిధంగా సంరక్షించుకోవాలో రైతులకు వివరించారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ఆత్మకూరు: బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంట్‌లో చర్చ లేకుండా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్షులు రజాక్, మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సుదర్శనవర్మ భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు తిరిగి ప్రారంభించాలన్నారు. భారత న్యాయసంహిత చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవి, విజయలక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: కార్మిక ప్రయోజనాలు మరచి, కార్పొరేటర్లకు అండగా ఉంటున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మండల సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సున్నిపెంటలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు దర్శనం నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, జాతీయ నగదు బదిలీకరణ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఏఎస్ఓ బాలలక్ష్మయ్యకు వినతి పత్రం ఇచ్చారు.